క్లుప్తంగా

మంత్రిని కలిసిన పేట వాసి



శుభాకాంక్షలు తెలుపుతున్న హస్సేన్

తాళ్లగడ్డ(సూర్యాపేట): నూతన మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన శాసన సభ్యుడు గడ్డం వివేక్‌ను సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల హస్సేన్ ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిజమైన పోరాట యోధురాలు యశోద



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

నూతనకల్ : తాను నమ్మిన సిద్ధాంతాన్ని చివరిదాక వదలకుండా కమ్యూనిస్టుగా నిలిచిన బత్తుల యశోద నిజమైన పోరాట యోధురాలు అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వెంకెపల్లిలో నిర్వహించిన యశోద సంస్మరణ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యశోద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంపీ రమణ, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, కందాల శంకర్‌రెడ్డి, గుర్రం శ్రీనివాస్, పులుసు సత్యం, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మడ్డి అంజిబాబు, తొనుకునూరి ఉప్పలయ్య, పోలోజు సైదులు, అబ్బగాని భిక్షం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం చేస్తున్న స్నేహితులు

అర్వపల్లి: అర్వపల్లికి చెందిన బండారి విజయ్ కుమార్ సతీమణి, ఎస్‌బీఐ సీఎస్‌పీ బండారి మహేశ్వరి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. దీంతో అతడి 2005–06 విద్యాసంవత్సరం 10వ తరగతి బ్యాచ్ స్నేహితులు తమ వంతుగా మిత్రుడికి ఆదివారం రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. స్నేహితులకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటున్నట్లు చెప్పారు.

అర్వపల్లిలో బడిబాట ప్రచారం



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం అర్వపల్లిలో జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 10వ తరగతి ఫలితాల్లో నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన కరపత్రాలను పంచిపెట్టారు. అన్ని వసతులు ఉన్న, నాణ్యమైన విద్య అందించే తమ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు ఎం. విజయలక్ష్మి, మంగలపల్లి యాకలక్ష్మి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి.. భవితకు పునాది

- గ్రామాల్లో విస్తృతంగా బడిబాట ప్రచారం
- సర్కారు పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన



సింగారెడ్డిపాలెంలో బడిబాట కార్యక్రమంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు(ఫైల్)

పెన్‌పహాడ్ : రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు పటిష్ట కార్యాచరణ చేపట్టింది. పాఠశాలల్లో అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండా బడిబాట కార్యక్రమం చేపట్టి ప్రభుత్వ బడుల్లో వసతులపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పెన్‌పహాడ్ మండలంలో 40 ప్రాథమిక, 4 ప్రాథమికోన్నత, 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులను సర్కారు బడిలో చేర్పించాలని విద్యావేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో కూడా బోధన అందుతుంది. మారుతున్న బోధన, అభ్యసన విధానాలకు అనుగుణంగా ఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వం శిక్షణ ఇస్తోంది.

క్రీడలకు ప్రాధాన్యం..

ప్రైవేట్ స్కూళ్లతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రభుత్వ పాఠశాలలకు విశాలమైన మైదానాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా పరికరాలు ఉండటంతో విద్యార్థులు క్రీడల్లో కూడా నైపుణ్యం సాధిస్తున్నారు.

పరిశోధనలకు అవకాశం..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పరిశోధనల్లో పాల్గొనే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. ఇన్‌స్పైర్ అవార్డుల పథకం ద్వారా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ప్రోత్సాహకాలను అందిస్తోంది. ప్రతి పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులకు రూ. 5వేల చొప్పున సాయం అందిస్తారు.

మధ్యాహ్న భోజనం, యూనిఫామ్..

పేద విద్యార్థులు రోజూ బడికి వచ్చేలా ప్రభుత్వం అన్ని సర్కారు బడుల్లో సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తెచ్చుకునే బాధ తప్పింది. అలాగే 1వ తరగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్ అందిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనాలు మంజూరు చేస్తోంది. పాఠశాల నుంచి ఇంటికి మూడు కిలో మీటర్లకుపైగా దూరం ఉండి ఎలాంటి రవాణా సౌకర్యం లేకపోతే 6, 7, 8 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.250 చొప్పున ప్రభుత్వం రవాణా భత్యం చెల్లిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తోంది.

నాణ్యమైన బోధనకు కృషి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థులకు అందించేందుకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ సైతం ఇప్పటికే ఆయా పాఠశాలలకు తరలించాం. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

– నకిరేకంటి రవి, ఎంఈఓ

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపడింతులు

చివ్వెంల : జ్యేష్ఠ మాస స్వాతి నక్షత్రం సందర్భంగా ఉండ్రుగొండలోని శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరుట్ల రవికుమార చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



తడి, పొడి చెత్తపై గృహిణులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్



క్లోరినేషన్ పరీక్ష చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సూర్యాపేట అర్బన్ : వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 7వ వార్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందివ్వాలని, మురికి కాలువలలో రోడ్లపై చెత్త వేయవద్దని అన్నారు. వీధి కుక్కల పట్ల జాగ్రత్త వహించి చిన్న పిల్లలను కుక్కల వద్దకు వెళ్లకుండా చూడాలని తెలిపారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించి మెడకు బెల్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వార్డుకు నీటిని సరఫరా చేసే పైపు నుంచి నీటిని తీసుకొని క్లోరినేషన్ టెస్టింగ్ చేశారు. నిరుపేద మహిళలను గుర్తించి వారిని స్వయం సహాయక సంఘంగా ఏర్పాటు చేసుకొనుటకు ప్రతిపాదనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి, టీఎంసీ శ్వేత, గుండు నాగరాజు, జవాన్ శ్రవణ్, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య, నీటి సరఫరా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో శాంతి భద్రతలు కాపాడాలి



నాగారం : రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ



తుంగతుర్తిలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి మొక్క అందిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

నాగారం : పోలీసులు నిబద్ధతతో పనిచేసి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సూర్యాపేట డీఎస్పీ వద్దె ప్రసన్న కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో నేరాలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే స్పందించి, బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. పోలీసులు ప్రజాసేవకు అంకితమై పనిచేయాలని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అలాగే పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ ఎం.ఐలయ్య, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్ రెడ్డిని కలిసిన డీఎస్పీ

తుంగతుర్తి : మాజీమంత్రి, సూర్యాపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్ రెడ్డిని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆదివారం తుంగతుర్తిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాజీ మంత్రికి మొక్కను అందించారు. ఆయనతోపాటు ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి ఉన్నారు.

గంగదేవమ్మ ఉత్సవాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో యాదవులు మూడేళ్లకోసారి నిర్వహించే గంగదేవమ్మ ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు పాల్గొన్నారు.

మృగశిర కార్తె.. జనంతో కిక్కిరిసిన చేపల మార్కెట్





సూర్యాపేట మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిక్కిరిసిన చేపల మార్కెట్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట పట్టణంలోని చేపల మార్కెట్ ఆదివారం కొనుగోలు దారులతో కిక్కిరిసిపోయింది. మృగశిర కార్తె ప్రారంభం రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదనే నమ్మకం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రజలు చేపల మార్కెట్‌కు బారులుదీరారు. ధరలు శనివారంతో పోలిస్తే ఆదివారం ధరలు విపరీతంగా పెరిగాయి. కొర్రమీను కిలో ధర రూ.350 నుంచి 550కు చేరగా, రొయ్యలు రూ.450 నుంచి రూ. 550కు చేరాయి. బొచ్చ, రవ్వ, బంగారుతీగ, చిత్తర చేపలు రూ.250 నుంచి రూ.300లకు పెరిగాయి.

ఉచిత వైద్యశిబిరం అభినందనీయం



శిబిరంలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కోహెన్స్ కంపెనీ హెచ్ఆర్ అడ్మిన్ సీనియర్ మేనేజర్ బి.వెంకటరమణ అన్నారు. ఆదివారం పట్టణంలోని కోహెన్స్ కంపెనీ పక్కన ఉన్న భరోసా సెంటర్లో కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి నెలా ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి అనారోగ్య సమస్య ఉన్న వారికి వైద్యపరీక్షలతో పాటుగా నెలకు సరిపడా మందులు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ప్రతినెలా ఈ ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అడ్మిన్ మేనేజర్ సైదులు, క్యాప్టన్ మేనేజర్ జీవన్ నాయక్, మేనేజర్ రాంబాబు, కోహెన్స్ లైఫ్ సైన్సెస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం-సంగెం రోడ్డు విస్తరణ పనులు



కోడూరు వద్ద నిర్మాణంలో ఉన్న బీటీ పనులు



రోడ్డు వెంట నిర్మించిన కల్వర్టు

అర్వపల్లి : తిమ్మాపురం-సంగెం రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం నుంచి తుంగతుర్తి మండలం సంగెం వరకు 13కి.మీ రహదారిని రూ. 20కోట్లతో విస్తరిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ రహదారి వెంట 25 కల్వర్టుల నిర్మాణ పనులు చేపట్టారు. కోడూరు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కాగా కోడూరు శివారు నుంచి సంగెం వరకు 4కి.మీ బీటీ నిర్మాణం పూర్తి చేశారు. మిగిలిన బీటీ పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి విస్తరణ పనులను ముమ్మరంగా చేపడుతున్నట్లు పంచాయతీరాజ్ డీఈ బాబూరావు, ఏఈ లావణ్య తెలిపారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు



అనంతారంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 విద్యా సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 33ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పాఠశాల నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందపడ్డారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లారెడ్డి, పూర్వ ఉపాధ్యాయులు ఒంటెద్దు వెంకట్‌రెడ్డి, మల్గిరెడ్డి మల్లారెడ్డి, నారాయణ, వీరయ్య, పూర్వవిద్యార్థులు బైరెడ్డి భద్రారెడ్డి, ఎ. శ్రీనయ్య, మధు, తిరుమల చారి తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ జెడ్పీహెచ్ఎస్ 2010–2011 విద్యాసంవత్సరం పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం గ్రామంలోని పాఠశాలలో సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం నాటి ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం కడారి వెంకన్న, ఉపాధ్యాయులు రోజా, శైలజ, శివయ్య, శ్రీనివాస్, శ్రీలక్ష్మి, తండు సైదులు, బానోతు రమేష్, విద్యార్థులు షేక్ జానిపాష, గుగులోతు నరేష్, బయ్య మధు, సాధిక్ పాష, యల్కపల్లి నరేందర్, గోగుల వీరబాబు, గ్యార బాబు, షేక్ నాగులు మీరా, బయ్య మల్లేష్, గోగుల నరేందర్, వినయ్ కుమార్, వెంకటేష్, మాధవి, భవాని, మౌనిక, మహేశ్వరి, స్వాతి, షహీన్, మస్తాన బీ, మొఘాలాబీ, రాజేశ్వరి, శశికళ తదితరులు పాల్గొన్నారు.



చివ్వెంల : వట్టిఖమ్మంపహాడ్ జెడ్పీహెచ్ఎస్‌లో..

ప్రతిరోజూ ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలి

అర్వపల్లి : ప్రతిరోజూ ధ్యానం చేసి ఆరోగ్యంగా ఉండాలని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటరంగారావు కోరారు. ఆదివారం అర్వపల్లిలోని ధ్యాన శిక్షణ కేంద్రంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత యోగా, ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఈ ధ్యాన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశిక్షకుడు పాలవెల్లి రమేష్, అభ్యాసకులు మేకల సత్యనారాయణ, మనుబోతుల వీరయ్య, డి. సతీష్, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ ఎస్ఐగా ప్రవీణ్ బాధ్యతల స్వీకరణ



ప్రవీణ్‌కుమార్

నూతనకల్: నూతనకల్ ఎస్ఐగా వాసా ప్రవీణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. సూర్యాపేట వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన మహేంద్రనాథ్ క్రైం బ్రాంచ్ ఎస్ఐగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

తిరుమలగిరి : అనంతారంలోని మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చెందిన సోఫియా, క్రిష్, భానుప్రకాష్, సాయిప్రణీత్ ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు స్కాలర్‌షిప్ వస్తుందని తెలిపారు.

విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 10, 11, 12తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ అన్నారు. ఆదివారం స్థానికంగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై మూడు రోజుల పాటు జరగనున్నట్లు తెలిపారు. సమావేశంలో నీలా రాంమ్మూర్తి, శ్రీను, సట్టు శ్రీను, గుర్రం ఏసు, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, వెంకటయ్య తదితరులున్నారు.

నడిగూడెం : హుజూర్‌నగర్‌లో ఈ నెల 10, 11, 12తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలానికి చెందిన గ్రామాల కమిటీల సభ్యులు, మండల కమిటీల సభ్యులు శిక్షణలో పాల్గొనాలని కోరారు. శిక్షణ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి, మల్లు లక్ష్మి హాజరుకానున్నట్లు తెలిపారు.

ముమ్మరంగా వాటర్‌షెడ్ పనులు



వాటర్‌షెడ్‌లో భాగంగా నిర్మించిన చెక్‌డ్యాం



రాతికట్టడం నిర్మాణం

- రూ.61లక్షలు మంజూరు
- ఇప్పటికే రూ.18.61లక్షల పనులు పూర్తి

అర్వపల్లి : ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) ద్వారా జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం గ్రామంలో వాటర్‌షెడ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పీఎంకేఎస్‌వై ద్వారా గ్రామంలో వివిధ పనులు చేపట్టుటకు రూ.61లక్షలు మంజూరయ్యాయి. అయితే ఈ నిధులతో భూగర్భ జలాల పెంపు కోసం ఊటకుంటల నిర్మాణం, చెక్‌డ్యాంలు, రాతి కట్టడాలు, ఫారంపాండ్స్, చెక్‌వాల్స్ నిర్మాణాలు చేపడుతున్నారు. భూసారం కొట్టుకుపోకుండా అరికట్టడం, నీటి నిల్వ కోసం వివిధ పనులు చేపడుతున్నారు. వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేయడం కోసం రాతి కట్టడాల (రాక్ ఫీల్డ్ డ్యాం) నిర్మాణం పనులు జరుగుతున్నాయి.

రూ.18.61లక్షల ఖర్చు..

వాటర్‌షెడ్‌ల నిర్మాణం కోసం గ్రామంలో ఇప్పటివరకు రూ.18.61లక్షలు ఖర్చు చేశారు. మిగిలిన పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు గ్రామంలో 4ఊటకుంటలు, ఒక చెక్‌డ్యాం, 25రాక్ ఫీల్డ్ డ్యాంలు, 10 విడిరాళ్ల కట్టడాల పనులు జరిగాయి. పనులను ఇటీవల కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులతో కలిసి పరిశీలించారు. పనులను వేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

రూ. 61లక్షలతో పనులు



వాటర్‌షెడ్ నిధులు రూ. 61లక్షలతో తిమ్మాపురంలో వివిధ పనులు చేపడుతున్నాం. పీఎంకేఎస్‌వై కింద ఈ నిధులు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ. 18.61లక్షలు ఖర్చు చేశాం. రైతులు ఈ పనులను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్. వినయ్‌భార్గవ్, వాటర్‌షెడ్ పీఓ

పనులు జరుగుతున్నాయి



పీఎంకేఎస్‌వై ద్వారా గ్రామంలో వాటర్‌షెడ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. భూగర్భ జలాలు పెరిగి బోర్లు, బావులలో నీళ్లు ఉబికేలా పనులు చేపడుతున్నాం. ఈ పనుల వలన రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– సీహెచ్. నగేష్, వాటర్‌షెడ్ మండల ఈసీ

మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న



విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : పేద ప్రజల కోసం పోరాడి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని రాష్ట్ర గీత సహకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. 16వ శతాబ్దంలో బహుజనులను ఇబ్బందులకు గురిచేస్తున్న మొఘల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా పోరాడి వారి పాలన నుంచి విముక్తి కల్గించిన యోధుడని కొనియాడారు. ఓ సాధారణ గీత కార్మికుడిగా ఉంటూ బహుజన కులాలను ఏకం చేసి పేద ప్రజల కోసం ఉద్యమించిన పాపన్నను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట జైగౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర మల్సూర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బొడ్డుగోపాల్ గౌడ్, గౌడపెద్దలు ఉన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

చిలుకూరు : గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందస్తుగా సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే నెల 7న గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.